# కిన్నెరసాని

●

[ ఎస్. భగవాన్ ]

మీటిన కిన్నెరతీగెనాదం లతవలె పెనవేసుకుంటూ, సుడిగాలివంపులకు వంకరలు తిరుగుతూ, ప్రతీఅణువునీ పులకరించి లేలెమ్మని లేవనెత్తుతుంది. ఆశీతల శరత్కాల చంద్రుని నీడలో నివసించే అనంతకోటి బృందమంతా తన్మయత్వంలో మధువుగ్రోలిన మంజరంవలె మేనువిడచి, మత్తెక్కి మహానందంలో తేలుతున్నాయి ఆకిన్నెర కంఠ మాధుర్యతరంగాలకు.

తీగెలమీద అర్థంలేకుండగా నాట్యం చేసే ఆవ్రేటిచమత్కారమో, లేక స్వరంతో లీనమై అమరలోకానికి లాక్కొనిపోయే ఆ బాలకంఠ శ్రావ్యమో, హృదయాంతంత్రులను కదలించే మరి ఏయితర మహత్తరశక్తియో- సెలయేటి వడిలో ఇసుకతిన్నెపై జారగిలబడి సర్వం ఈ రాగసుధారసమునకు వప్పగించి తన్మయంలో నాట్యభంగిమ సలుపుచున్నాడు నటరాజు.

గీతము త్వరితంగా నడుస్తుంది- ప్రేలి పటుత్వం పరిణమించింది. కంఠం ఎగిరిపోతుంది. మిన్నుముట్టింది. ఇచ్చట నటరాజు నిర్జనప్రదేశంలో నృత్యభంగిమలో అమృతం ఒలికిస్తున్నాడు. ఆరాధించేనర్తకి సామీప్యంలో లేదు. అలసినకొలది కిన్నెర పరుగిడినకొలది నాట్యం శక్తులను మించిపోయింది. పొంగిన సముద్రలలాగు నడుస్తుంది నాట్యం.

స్పృహతప్పి ఎప్పుడో పడిపోయింది బాల తనమందిరంలో. హంసతూలికా వేదికలపై శయనించింది. తన్మయత్వంలో తానెవరో తెలుసుకోలేని పరిణామంలో సెలయేటి సామీప్యంలో తిన్నెమీద పవ్వళించాడు నటరాజు........

బాల మందిరంలో ప్రవేశించటానికి అర్హతలేని నటరాజు తన ప్రదేశంనుండే ఆ గానకళను, ఆ బాలను ఆరాధించేవాడు. తన గానమాధుర్యంతో తన ప్రభువుకు జీవం పోయాలని ఆశతో ప్రతీరాత్రి ప్రకృతిఅంతా మాటుమణగి, నిద్రాదేవి జోలపాటకు నిదురించే సమయంలో తన కిన్నెరను మీటుతూ తన కంఠాన్ని జతపరుస్తుంది పిపాసి అచ్చట నుండియే తన్మయత్వుడౌతాడు.

ఎన్నో తియ్యటి రాత్రులు దాటిపోతున్నాయి. పగలంతా ఆరాత్రి సమయం కోసం ఎదురు చూచేవారు. భరించలేని విరహతాపం పడుతుంది బాల. నటరాజు స్పర్శకు ప్రతీఇంద్రియం త్వరపడుతున్నాయి. ఆనాటి రేయి, గానం పూర్తిచేసి కిన్నెరతో సహా మేలిముసుగులో నిర్భయంగా చకచక నడుస్తూ సెలయేరు సమీపించింది. గాఢనిద్రయో లేక తన్మయత్వంలో మరణించెనో. జీవచ్ఛవంవలె బోర్లపడియున్నాడు నటరాజు.

ప్రక్కలో నిశ్శబ్దంగా కూర్చుంది. మరల కిన్నెరను మీటింది. నృతులు అమర

●

వీధుల్లో పరుగిడుతున్నాయి. ఉపాసులను లాలిస్తున్నాయి. నటరాజు బాల ఉయ్యాలలో నిదురిస్తున్నాడు జోలపాట వింటూ.

కిన్నెర ఆపింది. తృళ్లిపడి లేచాడు నటరాజు. దిగ్భ్రమణింది దూరంగా జరిగాడు దేవకన్యక ప్రత్యక్షంకాబోలని. కిలకిలమని నవ్వుతూ, ఎగురుకుంటూ వచ్చి, నటరాజు వడిలోనికి దూకింది బాల. అనుకోనని ఆనందంలో మౌనంలోనే ఎన్నో గడియలు ఆనందించాడు. లెగిచి దూరాన్న నిలబడ్డాది బాల. ప్రారంభించాడు నటరాజు కిన్నెరను మీటుతూ. అంగలేస్తూ ఒకటొకటిగా శరీరాన్నుండి దూరంచేస్తుంది బాల. కొద్ది దూరంలో సెలయేటిఒడ్డున నగ్నంగా నిలపడ్డాది. తృప్తిలేని రాజు విజృంభించాడు. నాట్యంలోనే అడుగులేస్తూ నీటిలోనికి దిగింది బాల జలక్రీడా వినోదానికై.

చంద్రకాంతికి తళతళమెరిసే అలల అమృతాన్ని తామరరేకులతో వయ్యారంగా నటరాజుమీద వెదజల్లింది. ఆవేశపరుడై ఒడ్డుకు నడిచాడు. సిగ్గుతో ఇంకా లోపలికి వెళ్లింది. నిరాశతో అక్కడే చతికిలపడ్డాడు. మరల ప్రారంభించాడు. స్వరాన్ని సెలయేటి గర్భంనుండే అందించింది.

మేఘాలు పరుగిడుతున్నాయి శశాంకునిమించి. సైన్యం వెంబడించింది. శశాంకుడు పౌరుషంకొలది తప్పించుకొని ఈ తన్మయత్తులకు, రసపిపాసులకు సహాయం చేస్తున్నాడు. శత్రుబలం ఎక్కువయింది. లొంగక తప్పిందికాదు. ఎత్తుప్రదేశంనుండి భోరున శబ్దం. నటరాజు వ్రేలితోపాటు శరీరం కూడా లీనమైంది. ప్రపంచానికి, ప్రకృతికి, తనకు సంబంధంలేదు. దీక్షఅంతా ఆతీగెల వరుసమీదే. నిర్భయంగా నీటిలో కూర్చుండి ప్రభువును తనలో లీనంచేసుకుంటూ వుంది బాల.

తీగె తెగింది. భోరున రొదచేస్తూ ప్రవాహంవస్తుంది. కెవ్వున కేకలేస్తూ లెగిచి రాబోయింది బాల. ఆలశ్యమైంది. ప్రవాహపుఅలలతో మాయమైంది. రక్షించడానికి నటరాజు ఉద్రేకితుడైనాడు. కిన్నెరతోనే ఆప్రవాహంలోకి దుమికాడు. బాల కనుపించలేదు. రెండవ అలలో నటరాజు కూడా అంతరించాడు.

తామరలు మాయమైనాయి. వ్రేళ్ళమీద నిలబడ్డ పచ్చని మామిడిమొక్క మొదలుతోనేపెగిలి తెప్పయికొట్టుకపోయింది. తీతికపిట్ట అరుస్తూ ఏటికి అడ్డుగా దాటింది.